భారత్ సమాచార్.నెట్
BHARATH SAMACHAR DIGITAL

16, అక్టోబర్ 2026, శుక్రవారం | భారత్ సమాచార్

# నష్టపోయిన రైతులను ఆదుకోవాలి: MLA సునీత లక్ష్మారెడ్డి



భారత్ సమాచార్, మెదక్ జిల్లా: తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కోతల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పంటలు ఎండిపోయి పెట్టుబడులు నష్టపోయే పరిస్థితి ఏర్పడుతోందని నర్సాపూర్ MLA వాకిటి సునీత లక్ష్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. నెలల తరబడి కష్టపడి పంటల సాగు కోసం పెట్టిన పెట్టుబడులు వృథా అవుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు.

## విద్యుత్ కోతలకు కారణాలేంటి?

వ్యవసాయానికి అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడటంతో రైతులు పంటలకు నీరు అందించలేకపోతున్నారని సునీత లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. విద్యుత్ కోతలకు గల కారణాలను కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఉత్పత్తి, బొగ్గు సరఫరా విషయంలో ముందస్తు ప్రణాళికతో వ్యవహరించి, వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలోని BRS ప్రభుత్వం భద్రాద్రి, యాదాద్రి థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టిందని ఆమె గుర్తుచేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎదురవుతున్న విద్యుత్ సమస్యలపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాలని అన్నారు.

## సింగరేణిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి

తెలంగాణ విద్యుత్ వ్యవస్థకు కీలకమైన సింగరేణి సంస్థలో బొగ్గు ఉత్పత్తి, నిల్వలు, సరఫరాకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. సింగరేణిలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. సంస్థ వాటాల విక్రయం లేదా ప్రైవేటీకరణకు సంబంధించి ఏవైనా ప్రతిపాదనలు ఉంటే వాటిపై ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని అన్నారు.

## పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

విద్యుత్ కోతల కారణంగా పంటలు ఎండిపోయి, సాగు పెట్టుబడులు కోల్పోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆర్థికంగా ఆదుకోవాలని సునీత లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. పంట నష్టాలపై సమగ్ర సర్వే నిర్వహించి, నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని కోరారు.

కాలిపోయిన మోటార్లు, దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మరమ్మతు చేయించి, రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు.

© 2026 Bharath Samachar